
సాక్షి
పల్నాడు
బుధవారం । 15 । అక్టోబర్ । 2025



315 రోజులుగా దీక్షలు

తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 315వ రోజుకు చేరుకున్నాయి. శిబిరాన్ని కేసీ వర్క్స్ యూనియన్ నాయకులు సందర్శించారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 74,600 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 81,966 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నిల్వ 42.1600 టీఎంసీలు.



టీటీడీకి రూ.10 లక్షలు విరాళం

గుంటూరుమెడికల్: తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళాన్ని నుష్మగౌడ్ ఫౌండేషన్ అధ్యక్షులు జల్లెడ శ్రీనివాస్ గౌడ్,ఎస్ఎస్‌వీఎస్ ప్రసాద్‌గౌడ్‌లు అందజేశారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరుని హుండీ ఆదాయం



అమరావతి:అమరావతిలోని శ్రీ బాల చాముండికా సమేత శ్రీ అమరేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం హుండీలలోని కానుకలను లెక్కించారు. కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి దాసరి చంద్రశేఖరరావు సమక్షంలో 12 హుండీలను తెరచి లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు నెలల 7 రోజుల కాలానికి దేవాలయంలో ఉన్న హుండీల ఆదాయం మొత్తం రూ. 20,07,999. అన్నదాన మండపంలోని హుండీ ద్వారా రూ.48, 809 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి రేఖ తెలిపారు.

అచ్చంపేట జెడ్పీ హైస్కూల్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్



అచ్చంపేట: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు స్కూల్ ఎడ్యుకేషన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు కావలసిన వసతులు, తరగతి గదులను పరిశీలించారు. ఇక్కడ 1950లో స్థలదాత తుమ్మేపల్లి శ్రీరాములు నిర్మించిన పురాతన భవనం శిథిలం కాగా, ఇటీవల పూర్వవిద్యార్థులు సుమారు రూ.20లక్షల వ్యయంతో ఆధునీకరించారు. అందులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు అనుకూలమని ఆర్జేడీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే ఈ గదులను ఇంకా ఆధునీకరించవలసి ఉందన్నారు. త్వరలోనే పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు.

19న త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కార ప్రదానోత్సవం



గుంటూరు ఎడ్యుకేషన్ : తెలుగు సమాజంలోని గొప్ప సామాజిక విప్లవకారుడు కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఈనెల 19న సాయంత్రం 5 గంటలకు బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాలులో నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను మంగళవారం ఆవిష్కరించారు. 2025వ సంవత్సరానికి రామస్వామి చౌదరి పురస్కారాలను సుప్రసిద్ధ కవి, సాహితీ విమర్శకులు డాక్టర్ కోయి కోటేశ్వరరావు, రాజకీయ, సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లుకు ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో డాక్టర్ మూకిరి సుధ, వీసీకే పార్టీ మహిళా విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు కైలా జయసుధ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ – జాషువా – పూలే – పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ పాల్గొన్నారు.

నేటి నుంచి కాంట్రాక్టు విద్యుత్ ఉద్యోగుల సమ్మె



లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, జేఎల్ఎం గ్రేడ్ -2ల సమస్యల పరిష్కారం కోసం గురువారం నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ పోరాట కమిటీ జిల్లా చైర్మన్ దాసరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. పాతగుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం కమిటీ జనరల్ బాడీ సమావేశం రామ్‌ప్రభాకర్, జి.నాగరాజుల అధ్యక్షతన జరిగింది. చైర్మన్ దాసరి వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ నాగబ్రహ్మాచారి, జిల్లా గౌరవాధ్యక్షుడు బి.లక్ష్మణరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, జిల్లా నాయకులు సుబ్బారెడ్డి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె బాట పడతామని, దీనికి పూర్తిగా యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు జానీ, పవన్, రాంబాబు, వంశీ, అందే రాజేష్, కొండా, చంద్రశేఖర్ ఆచారి పాల్గొన్నారు.



డాక్టర్ గోపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు



ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు



ప్రకాష్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు, మహిళలు

మద్యాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం

- నకిలీ మద్యం తయారీపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలి
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెంటనే రాజీనామా చేయాలి
- వైఎస్సార్ సీపీ కార్యనిర్వాహక జిల్లా అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ
- భారీగా తరలివచ్చిన మహిళలు
- ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసుల యత్నం

నరసరావుపేట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 16 వేల సచివాలయాలు కట్టించి ప్రజల ముంగిటకే పాలన తీసుకువస్తే, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు 70 వేల బెల్టుషాపులు పెట్టి మద్యాన్ని డోర్ డెలివరీ చేస్తూ రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నకిలీ మద్యం తయారీపై పార్టీ అధిష్టానం పిలుపు మేరకు మంగళవారం డాక్టర్ గోపిరెడ్డి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. సీఐ ఫిరోజ్ ఆధ్వర్యంలో పోలీసులు ర్యాలీని అడ్డుకునేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. పోలీసు యాక్ట్ 30 అమలులో ఉన్నందున ర్యాలీకి అనుమతి లేదని, ర్యాలీ నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల ఆదేశాలను లెక్కచేయకుండా డాక్టర్ గోపిరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్.సుజాతాపాల్, డ్వాక్రా విభాగ జిల్లా అధ్యక్షురాలు హెల్డా ఫ్లోరెన్స్‌లతో కలసి పెద్ద ఎత్తున మహిళలు, నాయకులు, కార్యకర్తలు ప్రదర్శనగా బయలుదేరారు. గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద నుంచి బయలుదేరిన ర్యాలీ ప్రకాష్‌నగర్‌లోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకుంది. ఎక్సైజ్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ఐదుగురు మాత్రమే అనుమతించడంతో డాక్టర్ గోపిరెడ్డితోపాటు మహిళా నాయకులు లోపలికి వెళ్లి నకిలీ మద్యం తయారీ చేస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, సీబీఐ విచారణకు ప్రభుత్వం ఆదేశించాలని కోరుతూ ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేశారు.

యూరియా, మద్యం అమ్ముకుంటున్న టీడీపీ నేతలు

అనంతరం డాక్టర్ గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా విక్రయాలు జరిపించి, మద్యం అమ్మకాలు నియంత్రించారని తెలిపారు. చంద్రబాబు బెల్టు షాపుల ద్వారా గ్రామాల్లో ఇంటింటికి మద్యాన్ని డోర్ డెలివరీ చేస్తున్నాడన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో తయారైన నకిలీ మద్యం తాగి ప్రజలు చనిపోతున్నారని అన్నారు. నారా వారి కల్తీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్‌ను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని, ఇది దారుణమైన విషయమని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. కూటమి నాయకులు యూరియా, మద్యం అమ్ముకునే పనిలో ఉన్నారని విమర్శించారు. బెల్ట్‌షాపులు పెట్టించి ఒక్కొక్క షాపు నుంచి నెలకు రూ.2 నుంచి రూ.6 లక్షలు టీడీపీ నాయకులు వసూలు చేస్తున్నారని అన్నారు. నకిలీ మద్యం తయారీ వ్యవహారంపై సిట్ దర్యాప్తుకు ఆదేశించారని, ఈ సంస్థపై ప్రజలకు నమ్మకం లేదని, తక్షణమే సీబీఐ దర్యాప్తు వేయాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తక్షణమే రాజీనామా చేసి నిష్పాక్షిక దర్యాప్తునకు సహకరించాలని డిమాండ్ చేశారు.

■ జిల్లా కార్యదర్శి ఎస్.సుజాతాపాల్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ నకిలీ మద్యంపై ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం మహిళ కన్నీటితో కొట్టుకుపోవటం ఖాయమన్నారు. వారి మొర ఆలకించాలని కోరారు.

■ సోషల్ యాక్టివిస్టు ఈదర గోపీచంద్ మాట్లాడుతూ మద్యంపై మహిళలు పోరాడుతున్నందుకు తనకు సంతోషంగా ఉందన్నారు. మద్యంపై ఎన్టీఆర్ నిషేధం విధిస్తే అతని ప్రభుత్వాన్ని కూల్చివేసి చంద్రబాబు నిషేధం తొలగించాడని చెప్పారు. జోగి రమేష్‌పై మద్యం కేసు పెట్టడాన్ని చూసి దేశం మొత్తం నవ్వుతుందన్నారు.

■ పట్టణ అధ్యక్షులు షేక్ కరిముల్లా మాట్లాడుతూ చంద్రబాబు ప్రతిసారి అబద్ధపు హామీలతోనే అధికారంలోకి వస్తున్నాడని అన్నారు. నకిలీ సారా అమ్మి సంపాదించిన డబ్బుతో పార్టీని పోషించాలనుకుంటున్నాడని అన్నారు. కేసును ప్రతిపక్ష పార్టీపై తోసేందుకు చేసే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

కార్యక్రమంలో ఇంటలెక్చ్యువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఇయం.స్వామి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు పాలపర్తి వెంకటేశ్వరరావు, కనకా పుల్లారెడ్డి, ఎస్‌కే ఆంజనేయులు, గంటెనపాటి గాబ్రియేలు, రైతు విభాగ జిల్లా అధ్యక్షులు అన్నెం పున్నారెడ్డి, నరసరావుపేట, రొంపిచర్ల మండలాల కన్వీనర్లు తన్నీరు శ్రీనివాసరావు, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, పట్టణ వర్కింగ్ అధ్యక్షులు అచ్చి శివకోటి, నిడమానూరి సురేంద్ర, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షులు ఫణీంద్రరెడ్డి, ఎస్సీ విభాగం జిల్లా కార్యదర్శి నెలటూరి సురేష్, సర్పంచ్ భవనం నరిసిరెడ్డి, మాజీ కౌన్సిలర్ బత్తుల లక్ష్మీపద్మలత, షేక్ మస్తాన్ వలి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ బూదాల కల్యాణ్, ఎంపీటీసీ సభ్యుడు వెంకటప్పారెడ్డి, బీసీసెల్ పట్టణ అధ్యక్షులు మద్రిపూడి రాంబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు కొత్తూరి కిషోర్, ఎస్సీ సెల్ పట్టణ కార్యదర్శి పొలయ్య, వైఎస్సార్ సీపీ న్యాయ విభాగం అధికార ప్రతినిధి ఆర్.శ్రీనివాసరావు, మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షులు శిలార్‌బాషా పాల్గొన్నారు.

మద్యం సురక్ష యాప్‌పై అవగాహన కల్పించండి

- జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా
- ఎక్సైజ్ అధికారులతో సమీక్ష

నరసరావుపేట: జిల్లాలో మద్యం వినియోగదారులకు సురక్ష యాప్‌పై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ జిల్లా అధికారిని ఆదేశించారు. మంగళవారం ఎక్సైజ్ అధికారులతో కలెక్టరేట్‌లో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ఎటువంటి కల్తీ మద్యం విక్రయాలు జరగరాదని, అటువంటివి జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎక్సైజ్ అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా కల్తీ మద్యం లేదని, దీని కోసం ప్రత్యేక టీమ్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. జిల్లాలోని బార్లు, వైన్స్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశామని, ఎక్కడా కల్తీ మద్యం ఆనవాళ్లు కన్పించలేదని, ఆ మద్యం తాగి ఎటువంటి మరణాలు సంభవించలేదని అన్నారు. మద్యం బాటిల్ ఉత్పత్తి దశ నుంచి వినియోగం వరకు ట్రాక్ అండ్ ట్రేసింగ్ యాప్‌తో నిఘా ఉంచామని, ప్రజలు బాటిల్‌పై నున్న హీల్‌ని స్కాన్ చేస్తే బ్రాండ్, తయారీ తేదీ, ఎమ్మార్పీ వివరాలు తెలుస్తాయని చెప్పారు. ప్రజలు మద్యం షాపుల వద్దనే కొనుగోలు చేయాలని, హీల్ లేని బాటిళ్లను కొనుగోలు చేయవద్దని సూచించారు. మద్యం బాటిళ్లను హీల్ ద్వారా వెరిఫై చేయవచ్చని, బీర్ బాటిళ్లకు ఆ అవకాశం ఉండదని అన్నారు. బీరు లేబుల్‌పై ఉన్న బార్ కోడ్ ఎక్సైజ్ డిపార్టుమెంట్ వారిది కానందున యాప్ ద్వారా స్కాన్ చేయటం కుదరదని తెలిపారు. యాప్‌ని ఉచితంగా గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడుచేసుకోవచ్చని సూచించారు. యాప్ ద్వారా మద్యం బాటిల్ నకిలీదా కాదా అనేది గుర్తించవచ్చన్నారు.

ఏఎన్‌యూలో ప్రపంచ హస్తకళల దినోత్సవం

పెదకాకాని: సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంలో హస్తకళలు కీలకపాత్ర పోషిస్తాయని ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ పులిచెర్ల దేవకాంత్ అన్నారు. ప్రపంచ హస్తకళల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో హస్తకళలతో కూడిన ప్రదర్శన ఏర్పాటు చేశారు.

దీపావళి ఆనందంగా జరుపుకునేలా చర్యలు

- బాణసంచా భద్రత నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం
- పలు సూచనలు చేసిన కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ కృష్ణారావు



మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ కృష్ణారావు

నరసరావుపేట: ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి పండుగను జిల్లా ప్రజలందరూ ఆనందంగా, ఆహ్లాదకరంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లో బాణసంచా స్టాళ్ల అనుమతులు, భద్రతా చర్యలు, నిబంధనల పాటింపు అంశాలపై జిల్లా ఎస్పీ కృష్ణారావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలు, భద్రత చర్యలను పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ ఒక్కరూ బాణసంచా దుకాణం నిర్వహించకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘించే షాపులను సీజ్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్టాళ్లలోనే టపాసులు కొనుగోలు చేయాలని ప్రజలకు సూచించారు. షాపులు ఏర్పాటు చేసిన ప్రాంతంలో వాహనాల పార్కింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. లైసెన్స్ మంజూరు చేసే ముందు షాపుల వారితో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు ఇవ్వాలని ఆర్డీవోలను ఆదేశించారు. విద్యుత్, అగ్నిమాపక, పోలీసు, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని విక్రయదారుల కమిటీ సభ్యులకు సూచించారు. డీఆర్ఓ ఏకా మురళి, ఆర్డీఓలు, జిల్లా చీఫ్ ఫైర్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్లు, ఫైర్, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పట్టపగలే వ్యక్తి దారుణ హత్య

- కొబ్బరిబొండాల కత్తితో నరికి చంపిన దుండగుడు
- పాత కక్షలు, కుటుంబ కలహాలే కారణమని సమాచారం



ఘటనాస్థలంలో బుజ్జి మృతదేహం



తిరుపతిరావు అలియాస్ బుజ్జి (ఫైల్)

తెనాలి రూరల్: గుంటూరు జిల్లా తెనాలిలో పట్టపగలు ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. టిఫిన్ బండి వద్ద ఉన్న వ్యక్తిపై కొబ్బరి బొండాల కత్తితో దాడి చేసి దుండగుడు హతమార్చాడు. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బాపట్ల జిల్లా అమృతలూరు మండలం కోరుతాడిపర్రు గ్రామానికి చెందిన జూటూరి తిరుపతిరావు అలియాస్ బుజ్జి (60) గ్రామంలోని తమ సామాజిక వర్గంలో పెద్దగా ఉన్నాడు. ఆయనకు ఐదుగురు కుమార్తెలు. పెద్ద కుమార్తె గండికోట దుర్గ తెనాలి చెంచుపేటలోని ఎమ్మెల్యే బజారులో ఉంటోంది. బుజ్జి పది రోజుల క్రితం కుమార్తె వద్దకు వచ్చాడు. బైక్‌పై టిఫిన్ బండి వద్దకు మంగళవారం ఉదయం వెళ్లాడు దోశలు ఆర్డరిచ్చి వేరే వ్యక్తితో మాట్లాడుతున్నాడు. అంతలోనే ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి కొబ్బరి బొండాలు నరికే కత్తితో తిరుపతిరావుపై దాడి చేసి అత్యంత పాశవికంగా హత్య చేశాడు. నిందితుడు ముఖానికి మాస్క్ వేసుకుని ఉన్నాడని, హత్యానంతరం తన వాహనంపై వెళ్లిపోయాడని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న డీఎస్పీ బి. జనార్దనరావు, త్రీ టౌన్ సీఐ ఎస్. సాంబశివరావు, ఎస్ఐ కరిముల్లా తమ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుంటూరు నుంచి వచ్చిన డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారణమేంటి?

పాత కక్షలు, ఆధిపత్య పోరు కారణంగానే ఈ హత్య జరిగినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. కోరుతాడిపర్రు గ్రామంలో ఆలయానికి సంబంధించిన నగదు పాట నిర్వహించడం, ఆలయ వ్యవహారాల పర్యవేక్షణ వంటివి బుజ్జి చూస్తుంటాడు. అమృతలూరు సొసైటీ సభ్యుడిగా కూడా ఉన్నాడు. ఆలయ వ్యవహారం ఏళ్లుగా ఒక్కరే చూడాలా అంటూ గ్రామానికే చెందిన అల్లుడు వరుస అయ్యే వ్యక్తి ఇటీవల బుజ్జితో వాగ్వాదానికి దిగాడని, అలాగే తన తండ్రి మృతికి తిరుపతిరావు కారణమంటూ గతంలో ఘర్షణ పడ్డాడని తెలుస్తోంది. అతనే ఈ హత్య చేసి ఉంటాడని అటు గ్రామస్తులు కూడా భావిస్తున్నారు. మరో వైపు తిరుపతిరావు మనవరాలికి ఆమె భర్తకు మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. మూడు రోజులుగా తెనాలి చెంచుపేటలో ఈ పంచాయితీ వ్యవహారం నడుస్తోంది. కుటుంబ కలహాలకు తిరుపతిరావే కారణమని, అతడిని హతమారిస్తే కలహాలు ఉండవంటూ మనవరాలి భర్త సోమవారం రాత్రి హెచ్చరించాడని చెబుతున్నారు. గ్రామంలో ఆధిపత్య పోరులో అల్లుడి వరుస అయ్యే వ్యక్తి లేదా మనవరాలి భర్త ఈ హత్యకు పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నారు. వారిద్దరూ ఒక్కటై హత్య చేసి ఉంటారనే కోణంలోనూ పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నియమాలు పాటిస్తే ప్రతి ఇంట్లో వెలుగులు

- చిన్నపాటి మెళకువలతో ప్రమాదాలకు చెక్
- వ్యాపారుల అప్రమత్తతే ముఖ్యం
- దీపావళి పండగపై సూచనలు చేసిన డీఎఫ్‌వో శ్రీధర్

అందరి ఇళ్లలో వెలుగులు నింపే పండుగ దీపావళి. పండుగ రోజు సంతోషంగా ఉండాలంటే మనం కొన్ని జాగ్రత్తలు పాటించాలి. జాగ్రత్తలు పాటించకుంటే ఆ ఇంటిలో సంతోషం కనుమరుగయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎస్.శ్రీధర్ కొన్ని సూచలను చేశారు.

నరసరావుపేటటౌన్: జాగ్రత్తలు పాటించి సంతోషమైన దీపావళి జరుపుకోవాలని పల్నాడు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎస్. శ్రీధర్ అన్నారు. రానున్న దీపావళి పండగను పురస్కరించుకొని హోల్‌సేల్, తాత్కాలిక బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరవుతున్న నేపథ్యంలో వ్యాపారులు, ప్రజలు పాటించాల్సిన భద్రత చర్యలను జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి 'సాక్షి'తో పంచుకున్నారు.

లైసెన్స్ పొందే విధానం..

వ్యాపారి స్టాల్ ఏ ప్రదేశంలో పెడుతున్నారు? అక్కడ ప్రజల నివాసాలు, వ్యాపార సముదాయాలు తదితర విషయాలను సంపూర్ణంగా పరిశీలించిన తర్వాత నిరభ్యంతర సర్టిఫికెట్ ఇస్తాం. ఆ తర్వాత ఆర్డీవో లైసెన్స్ మంజూరు చేస్తారు. గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది దుకాణాల ఏర్పాటు కోసం లైసెన్స్‌లు పొందిన వారు తక్కువ. పల్నాడు జిల్లాలో నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి పట్టణాలు ఉన్నాయి. ప్రతి ఏటా జిల్లా వ్యాప్తంగా సుమారు 130 మంది తాత్కాలిక లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంటారు. ప్రస్తుతం 100 మంది దరఖాస్తు చేశారు. నరసరావుపేట పట్టణంలో గత ఏడాది 40 మంది లైసెన్స్ తీసుకుంటే ఈ ఏడాది 27 మంది మాత్రమే ముందుకొచ్చారు. లైసెన్స్ పొందిన దుకాణదారులు ఈ నెల 19, 20, 21 తేదీల్లో మాత్రమే మందులు విక్రయించాలి.



షాపుల ఏర్పాటులో నిబంధనలు ఇలా...

స్టాల్స్ ఏర్పాటు చేసేటప్పుడు తగలబడే స్వభావం లేని మెటీరియల్‌తో దుకాణాలు నిర్మించుకోవాలి. బహిరంగ ప్రదేశాలలో షాపు ఉండేలా చూసుకోవాలి. షాపుకి, షాపుకి మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలి. పెట్రోల్ బంకుకు 15 మీటర్ల దూరంలో స్టాల్స్ పెట్టుకోవాలి. స్టాల్స్ ఉన్న ప్రదేశంలో పొగతాగటం నిషేధం. ప్రతి షాపు వద్ద రెండు బక్కెట్లలో నీరు, రెండు బక్కెట్లలో ఇసుక ఉంచుకోవాలి.

పాటించాల్సిన జాగ్రత్తలు...

- పండగ జరుపుకునే సందర్భంలో కాటన్ దుస్తులు ధరించాలి.
- దీపావళి మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ కిచెన్, మూసి ఉన్న గదుల్లో పెట్టరాదు.
- పిల్లలు మందులు కాల్చేటప్పుడు తప్పనిసరిగా పెద్దవాళ్లు పక్కనే ఉండాలి.
- గ్రామాల్లో పూరి గుడిసెలు, గడ్డివాముల దగ్గర మందులు కాల్చకూడదు.

దీపావళి సంతోషంగా ఉండాలంటే ..



చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి దారి తీస్తుంది. దీపావళి పండుగ ప్రతి ఇంటిలోనూ కొత్త వెలుగులు నింపాలంటే కొద్దిపాటి మెలకువలు పాటించాలి. మన అజాగ్రత్త మరొకరికి బాధగా మారకూడదు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి వెలుగుల పండగను జరుపుకోవాలి. ప్రతి ఒక్కరూ భద్రత నియమాలను పాటిస్తే దీపావళి పండుగ ప్రతి ఇంట్లో వెలుగు నింపుతుందని డీఎఫ్‌వో వివరించారు.

జనార్దనరావు వీడియో వెనుక ప్రభుత్వ పెద్దలు



- ఆఫ్రికా నుంచి విడుదల చేసిన వీడియోలో జోగి రమేష్ ప్రస్తావన ఎందుకు లేదు
- నకిలీ మద్యంపై రెడ్‌హ్యాండెడ్‌గా దొరికినా వైఎస్సార్ సీపీపై మోపడం దుర్మార్గం
- ముందురోజు సీఎం మాటలే జనార్దనరావు వీడియో ప్రసంగం
- జనార్దనరావు ఫోను గుట్టు తేల్చండి
- సీబీఐ దర్యాప్తునకు ఎందుకు భయం
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు

ఒంగోలు సిటీ: కుటీర పరిశ్రమల్లా నకిలీ మద్యం తయారుచేస్తూ, ఆధారాలతో సహా బయటపడినప్పటి నుంచి దాన్ని ఎలాగైనా వైఎస్సార్ సీపీకి అంటించేందుకు టీడీపీ పెద్దలు చేస్తున్న కుట్రలు పరాకాష్టకు చేరాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు ఆరోపించారు. ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నకిలీ మద్యం కేసులో వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి జోగి రమేష్‌కు ప్రమేయం ఉందంటూ ఆ కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు ఆరోపణ చేయడం విడ్డూరంగా ఉందని చెప్పారు. దానిపై ఎల్లో మీడియా రెచ్చిపోతూ, నిన్న సాయంత్రం నుంచే ట్రోల్స్ చేస్తోందన్నారు. కేవలం వైఎస్సార్ సీపీపైనా, ఆ పార్టీ నాయకులపైనా కక్ష సాధింపులకు పాల్పడడం, కేసు నుంచి తాము బయటపడేందుకు డైవర్షన్ రాజకీయాల్లో భాగంగా సీఎం చంద్రబాబు చేసిన కుట్ర అని దుయ్యబట్టారు. 'అసలు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న అద్దేపల్లి జనార్దనరావు వీడియో ఎలా రికార్డ్ చేశాడు? పైగా తన ఫోన్ పోయిందని చెప్పినట్లు ఎల్లో మీడియాలోనే వచ్చింది. అలాగే ఏ కేసులో నిందితుడైనా, ఇన్వెస్టిగేషన్ అధికారుల ముందు ఏదైనా చెప్పాలనుకున్నప్పుడు నిలబడి, చేతులు కట్టుకుని మాట్లాడతారు. కానీ నిన్న జనార్దన్‌రావు లీక్ చేసిన వీడియోలో ఆయన చైర్‌లో కూర్చుని ఉన్నాడు. పక్క నుంచి ఎవరో ప్రాంప్ట్ చేస్తున్నట్లుగా ఉంది. పైగా తను ఆఫ్రికా నుంచి వచ్చినప్పటి డ్రెస్‌తోనే ఉన్నాడు. మరి ఆ వీడియో ఎప్పుడు, ఎవరు, ఎవరి ఫోన్‌లో రికార్డు చేశారు? ఇదంతా చూస్తుంటే, ఒక పథకం ప్రకారం చేసిన కుట్ర మాదిరిగా కనిపించడం లేదా' అని వరికూటి ప్రశ్నించారు. ఆ వీడియోను మీడియాకు ఎవరు విడుదల చేశారు? అన్నది తేలాలన్నారు. ఈ కేసులో వాస్తవాలను కప్పిపుచ్చుతూ కొత్త కట్టుకథ వినిపించేందుకే ఆ వీడియో విడుదల చేశారన్నది స్పష్టమవుతోందని పేర్కొన్నారు. పోలీసుల అదుపులో, జైలు అధికారుల రిమాండ్‌లో ఉన్న వ్యక్తి వీడియో లీకు కావడానికి బాధ్యత ఎవరిదని నిలదీశారు. జనార్దనరావు గత వారం ఆఫ్రికా నుంచి కూడా ఒక వీడియో రిలీజ్ చేశాడని, నకిలీ మద్యం తయారీలో పార్టీ, ప్రభుత్వ పెద్దల ప్రమేయం లేదని, తామే ఆ పని చేశామని చెప్పుకొచ్చాడన్నారు. ఆ రోజే మరి నిజంగా జోగి రమేష్ పేరు ఎందుకు ప్రస్తావించలేదని, రమేష్ చెబితేనే తాను నకిలీ మద్యం తయారుచేసిన విషయాన్ని ఆ వీడియోలోనే ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు.

చంద్రబాబు సన్నిహితుడే..

కేసులో ఏ–1 నిందితుడైన జనార్దనరావు చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడేనని, 2024 ఎన్నికల్లో తంబళ్లపల్లె టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా జయచంద్రారెడ్డికి చంద్రబాబు టికెట్ ఇచ్చినప్పుడు జనార్దనరావు అక్కడే ఉన్నాడన్నారు. బీఫాం ఇచ్చేటప్పుడు అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యులే ఉంటారు. జనార్దనరావు ఆ సమయంలో చంద్రబాబు, జయచంద్రారెడ్డిలతో ఉండటం దేనికి సంకేతమన్నారు. ఇన్ని ఆధారాలు కనిపిస్తున్నా జనార్దనరావుకు రమేష్ సన్నిహితుడన్న వాదన అవాస్తవం.

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	57,430
అమ్మకాలు	56,332
నిల్వ	13,955

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–15,200
నంబరు–5	10,000–14,200
273	10,500–14,000
341	10,000–15,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–15,000
నంబరు–5	10,000–14,500
341	10,000–15,600
4884	10,000–14,000
సూపర్–10	10,500–14,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,200
బాడిగ–355	10,500 – 15,800
దేవనూరు డీలక్స్	10,000 – 14,800
ఆర్మూర్	9,800 – 12,500
తాలుకాయలు	5,500 – 7,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–15,000
బాడిగ – 355	10,000–15,500
దేవనూరు డీలక్స్	10,500–14,700
తాలు	5,300 – 8,000

–కొరిటిపాడు (గుంటూరు)

మెడికల్ కళాశాలలను కాపాడుకుందాం

- వైద్య కళాశాలలు ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి
- మాజీ మంత్రి విడదల రజిని
- మురికిపూడిలో రచ్చబండ నిర్వహణ

చిలకలూరిపేట: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని మాజీ మంత్రి విడదల రజిని అన్నారు. చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో రచ్చబండ ద్వారా సంతకాల సేకరణ కార్యక్రమానికి సోమవారం రాత్రి శ్రీకారం చుట్టారు. ముందుగా ఆమె సంతకం చేసి ప్రజలతో కోటి సంతకాల సేకరణలో భాగంగా సంతకాలు చేయించారు. రజిని మాట్లాడుతూ రచ్చబండ ద్వారా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడదామని తెలిపారు. మెడికల్ కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే నిర్వహించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ గ్రామ స్థాయి వరకు ప్రజాఉద్యమం ప్రారంభించిందని వెల్లడించారు. పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యాన్ని, పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 ప్రభుత్వ వైద్యకళాశాలల నిర్మాణం చేపట్టారని తెలిపారు. ఇందుకు విరుద్ధంగా చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పేదల నాణ్యమైన వైద్యం, వైద్య విద్య దూరం చేసేలా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు శ్రీకారం చుట్టి తనకు ఏ మాత్రం పేదల పట్ల ప్రేమ లేదని చాటు కున్నారని



మాట్లాడుతున్న మాజీ మంత్రి విడదల రజిని



మహిళలతో సంతకాలు చేయిస్తున్న మాజీ మంత్రి విడదల రజిని

ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలు, ప్రజాసంఘాలతో కలసి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఉద్యమంలో భాగంగా అక్టోబర్ 28న నియోజకవర్గ కేంద్రాల్లో, నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో భారీ ర్యాలీ చేపట్టి సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట మండల అధ్యక్షుడు దేవినేని శంకరరావు, ఉపాధ్యక్షుడు కొమ్మనబోయిన హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, మానుకొండ శేషిరెడ్డి, బొల్లు శ్రీకాంత్, గ్రామ ఉపసర్పంచ్ కొమ్మనబోయిన రామకృష్ణరాజు, శ్రీను, పార్టీ గ్రామ అధ్యక్షుడు బొట్టు సోమయ్య, ఎద్దు అశోక్, చెంచు రాముడు, గోగు ముక్కంటి, అందె శ్రీనివాసరావు, ఆరుమళ్ల నాగేశ్వరరావు, మురికిపూడి కృష్ణ, షేక్ నూర్ అహమ్మద్, యలమంద, మైలా రాజేష్, బండారు జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువులే పంటకు జీవం

- పల్నాడు జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం నగేష్
- శాస్త్రవేత్తల రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహణ

యడ్లపాడు: ప్రతి పంటకు జీవం జీవన ఎరువులేనని పల్నాడు జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం నగేష్ అన్నారు. జీవన ఎరువుల ప్రాముఖ్యతపై జరుగుతున్న వారోత్సవాలలో భాగంగా మంగళవారం యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పీవీ సత్యగోపాల్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. నగేష్ మాట్లాడుతూ జీవన ఎరువుల వినియోగం వల్ల దాదాపుగా 25 శాతం రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. ఇవి భూసారాన్ని పెంపొందించి, పంటలో జీవవైవిధ్యాన్ని పెంపొందించడంలో సహాయపడతాయని అన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడిని, నాణ్యతతో కూడిన దిగుబడిని సాధించవచ్చని తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర్ పీవీ సత్యగోపాల్ మాట్లాడుతూ ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా తయారయ్యే జీవన ఎరువులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం నగేష్

రైతులకు ఎంతో ఉపయోగంగా ఉన్నాయని వివరించారు. గాలిలోని నత్రజనిని స్థిరీకరించి పంటకు అందుబాటులోకి తేవడం, భూమిలో అందుబాటులో లేని భాస్వరం, పొటాష్ పోషకాలను మొక్కకు అందుబాటులోకి తేవడం, రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో జీవన ఎరువులు ప్రధాన పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి హేమలతాదేవి, అభ్యుదయ రైతు పోపూరి శివరామకృష్ణ, జగ్గాపురం, యడ్లపాడు గ్రామాల్లోని విద్యార్థినులు పి గాయత్రి, ఎ బేబీవిజయశ్రీ, సీహెచ్ కీర్తిశ్రీనిధి, జ్యోత్స్న, ఎ జోషిత శ్రేయ, చాందిని, భాగ్యశ్రీ, ఎం జ్యోత్స్న, డి భువనేశ్వరీ, ఎన్ హర్షిత, కె హర్షిత, ఎండీ హమిద పాల్గొన్నారు.

క్లుప్తంగా

మొక్కజొన్న విత్తనాలు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



నరసరావుపేట రూరల్: అధిక ధరకు మొక్కజొన్న విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి 15 రోజులకు విత్తన స్టాక్ రిపోర్ట్‌ను అందజేయాలని తెలిపారు. రైతుకు ఇచ్చే బిల్లు మీద తప్పనిసరిగా లాట్ నెంబర్ వేయాలన్నారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందజేయాలని, విత్తన చట్టానికి లోబడి ప్రతి డీలరు వ్యాపారం చేయాలని స్పష్టంచేశారు. వ్యవసాయ సంచాలకులు వి.హనుమంతరావు, నరసరావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, ఏఓ శాంతి పాల్గొన్నారు.

నేడు అబ్దుల్ కలాంకు వైఎస్సార్ సీపీ నివాళి

నరసరావుపేట: దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకుని బుధవారం ఉదయం 10 గంటలకు పల్నాడు రోడ్డులోని విగ్రహానికి నివాళులర్పించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైఎస్సార్ సీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉదయం 9.30 గంటలకు గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్దకు రావాలని కోరారు.

ప్రతి ఒక్కరూ స్వదేశీ ఉత్పత్తులనే వాడాలి

బీజేపీ ఆత్మనిర్భర్ భారత్ కన్వీనర్ అశోక్‌రాజు

నరసరావుపేట: ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తు ఉత్పత్తుల వాడకాన్ని ప్రోత్సహించి తద్వారా దేశ ఆర్థిక స్వావలంనలో పాలుపంచుకోవాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆత్మ నిర్భర్ భారత్ కోస్తా ఆంధ్ర కన్వీనర్ కోడూరి అశోక్‌రాజు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు ఏలూరి శశికుమార్ అధ్యక్షతన మంగళవారం నరసరావుపేట సత్తెనపల్లి బస్టాండ్ సెంటర్‌లోని విజయ్‌కుమార్ కల్యాణ మండపంలో నిర్వహించిన ఆత్మ నిర్భర్ భారత్ జిల్లా కార్యశాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ కోవిడ్ అనంతరం ఆత్మనిర్భర్ భారత్ కోసం రూ.20లక్షల కోట్ల ఉద్దీపన ప్యాకేజ్ కేటాయించి మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ద్వారా స్థానిక వస్తు ఉత్పత్తులను ప్రోత్సహించారని అన్నారు. ప్రస్తుతం నాల్గవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించి అతిత్వరలో మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఈ దేశాన్ని జగద్గురువుగా అగ్రగామిగా నిలబెట్టే ప్రయత్నంలో ప్రజలను భాగస్వాములను చేసే విధంగా ప్రతి



ఆత్మ నిర్భర్‌పై ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

ఒక్క పార్టీ కార్యకర్త కృషిచేయాలని పిలుపునిచ్చారు. అధ్యక్షత వహించిన శశికుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో స్వదేశీ ఉద్యమానికి ఉన్న ప్రాధాన్యం నేడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన ఆత్మనిర్భర్ భారత్‌కు ఉందని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆత్మనిర్భర్ కార్యక్రమ జిల్లా కన్వీనర్ శెట్టి హనుమంతరావు సమావేశంలో పాల్గొన్న సభ్యులచే స్వదేశీ వస్తు ఉత్పత్తుల వాడకాన్ని ప్రోత్సహించే ప్రతిజ్ఞ చేయించారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేంద్రరెడ్డి. జిల్లా ఇన్‌ఛార్జి కొక్కెర శ్రీనివాస్, జిల్లా పదాధికారులు, మండల నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, మండల త్రిసభ్య కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు రాయపూడిలో విద్యుత్ అదాలత్

అమరావతి: తుళ్లూరు మండలం రాయపూడిలో ఉన్న విద్యుత్ భవన్‌లోని కాన్ఫరెన్స్ హాలులో బుధవారం విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు అమరావతి క్యాపిటల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్.వెంకటేశ్వరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదాలత్ ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెస్సల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ జడ్జి ఎస్.విక్టర్ ఇమ్మాన్యుయేల్, సాంకేతిక సభ్యులు డి.కృష్ణానాయక్, ఆర్థిక సభ్యులు ఆర్‌సీహెచ్. శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు సునీత, స్థానిక ఎస్ఈ ఎం.శ్రీనివాసరావు పాల్గొంటారన్నారు. అమరావతి క్యాపిటల్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా సర్వీస్ నంబరు, సెల్ నంబరు, పూర్తి అడ్రస్‌తో కూడిన వివరాలు సమర్పించి విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పోస్టింగులు ఇవ్వాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలో విద్యార్థుల సంఖ్య 40 కంటే తక్కువగా ఉన్న 46 ఎయిడెడ్ పాఠశాలలు మూతపడనున్న దృష్ట్యా ఆయా పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వ పాఠశాలల్లో పోస్టింగులు ఇవ్వాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.థామస్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత పాఠశాలల్లో పని చేస్తున్న 100 మంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలలను కేటాయించి, సర్వీసుకు, వేతనాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కొందరు ఉపాధ్యాయులు మృతి చెందిన నేపథ్యంలో కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, హెల్త్‌కార్డులు ఇచ్చి, సెలవులను స్వేచ్ఛగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎయిడ్స్ నియంత్రణ లక్ష్యాలు సకాలంలో పూర్తిచేయండి

జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ యు.మాధవీలత

నరసరావుపేట: జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ కోసం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ యు.మాధవీలత పేర్కొన్నారు. మంగళవారం కార్యాలయం నుంచి ఎయిడ్స్ నియంత్రణ చర్యలపై జిల్లాలోని ఐసీటీసీ, పీపీటీసీటి, ఏఆర్‌టీ, డీఎస్ఆర్‌సీ, లింక్ ఏఆర్‌టీ, టీఐ, ఎన్‌జీఓఎస్‌లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ కోసం పరీక్షలు పెంచాలని, ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. హెచ్ఐవీ నిర్ధారణ జరిగిన ప్రతి ఒక్కరిని ఏఆర్‌టీకి లింక్ చేయాలని, ఆయా కేంద్రాల ద్వారా హెచ్ఐవీ ఉన్న వారికి మందులు పంపిణీ చేయాలని ఆదేశించారు. అర్హత



సమీక్ష చేస్తున్న డాక్టర్ మాధవీలత

ఉన్న ప్రతి పేషెంట్‌కు ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా పెన్షన్‌కు దరఖాస్తు చేయాలని, ఆయా కేంద్రాలలో ఎల్ఆఫ్‌యూ కేసులను కూడా తగ్గించాలని పేర్కొన్నారు. జిల్లాలోని గ్రామాలు, పట్టణాలు, స్కూళ్లు, కళాశాలల్లో విద్యార్థిని, విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖ వ్యాధులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ జానీబాషా, క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ చైతన్య, క్లస్టర్ ప్రివెన్షన్ ఆఫీసర్ కిరణ్, టెక్నికల్ ఎక్స్‌ఫర్ట్ శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): రైళ్లలో వరుస చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ) అరెస్టు చేశారు. అతని వద్ద 64 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ జె.వి.రమణ కథనం మేరకు.. సెప్టెంబర్ నెలలో రైళ్లలో బంగారు ఆభరణాలు కలిగిన లగేజీ బ్యాగుల చోరీలపై నమోదైన రెండు కేసులకు సంబంధించి జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతే అలీబేగ్, జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ జె.వి.రమణలు తమ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వేజెండ్ల గ్రామానికి చెందిన మూల్పూరి ఫణీంద్ర కుమార్‌ను నిందితుడిగా గుర్తించారు. గతంలో రైళ్లు, స్టేషన్లలో ఇతడు నేరాలు చేసి



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

జైలుకు కూడా వెళ్లొచ్చాడు. నిందితుడు మంగళవారం విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్, శివాలయం వీధిలో ఉన్నట్లు సమాచారం అందటంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.3.68 లక్షల విలువైన నగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

సాగులో సాంకేతికతపై పట్టు సాధించాలి

రేపల్లె: వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించటంపై పట్టుసాధించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు అద్దేపల్లి లక్ష్మి అన్నారు. సాగులో సాంకేతికత వినియోగంపై వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో మండలంలోని పేటేరు వ్యవసాయ సహాయ కేంద్రంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న మార్పులకు అనుగుణంగా యంత్ర పరికరాలు వస్తున్నాయని, వీటితో సమయం, డబ్బులు ఆదా అవుతాయని చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.ఏడుకొండలు మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే మినీ రైస్ మిల్, అపరాల పంటల విధానాలు, వివిధ రకాల నూనె గింజల నుంచి నూనె తయారు చేసే విధానాలను వివరించారు. డాక్టర్ వాసుదేవ మాట్లాడుతూ



మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మి

సోలార్ డ్రైయర్ పనితీరు, దీని ఉపయోగంతో పాటు పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ ద్వారా రైతులు పంటకు విలువ జోడించి అధిక ఆదాయం పొందే మార్గాలను సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సందీప్, ఏఓ మహేష్‌బాబు, వీఏఏ రాయల్ బాబు, రైతులు, బాపట్ల పోస్ట్ హార్వెస్టర్ రీసెర్చ్ సెంటర్ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో రజత పతకం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఒడిశాలో ఈ నెల 10 నుంచి 14 వ తేదీ వరకు జరిగిన 40వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో గుంటూరుకు చెందిన ఎస్కే రోషన్ రజత పతకం సాధించాడు. అండర్ 20 యూత్ విభాగంలో 110 మీటర్ల హర్డిల్స్‌లో ఈ పతకాన్ని సాధించాడని అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జి.వి.ఎస్. ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రోషన్‌ను ఏపీ రెరా సభ్యుడు దామచర్ల శ్రీనివాసరావు స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో అభినందించారన్నారు. స్టేడియంలో అథ్లెటిక్స్ ట్రాక్ కూడా బాగు చేయాలని కోరారు. సదుపాయాలు కల్పిస్తే మరింత మంది రాణిస్తారని



రోషన్‌ను అభినందిస్తున్న డి.శ్రీనివాసరావు, జీవీఎస్ ప్రసాద్

ఆకాంక్షించారు. రోషన్‌ను కోచ్ రామకృష్ణ, కె.రవి, కె.అరుణ్ కుమార్, పి.ఆనంద్ కుమార్, ఎస్కే మన్సూర్ వలి తదితరులు అభినందించారు.

25న తెనాలిలో ఆంధ్రప్రదేశ్ పాడి రైతుల సభ

తెనాలి: పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల తరహాలో లీటరుకు రూ.8–10 ప్రోత్సాహకధర ఇవ్వాలని కోరుతూ ఈ నెల 25వ తేదీన తెనాలిలో సభ నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ పాడి రైతుల జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. తెనాలిలో మంగళవారం పాడిరైతులతో కలసి మహాసభ ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. అనంతరం



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న రైతులు

మాట్లాడుతూ తెనాలి అయితానగర్‌లోని నన్నపనేని సీతారామయ్య సరస్వతమ్మ కల్యాణమండపంలో 25న ఉదయం 10 గంటలకు మహాసభ జరుగుతుందని తెలిపారు. గేదె పాలు లీటరుకు రూ.40, ఆవు పాలు రూ.20కు మించి డెయిరీల్లో ధర రావటం లేదన్నారు. పాడి పశువులకు బీమా మార్కెట్ ధర ప్రకారం నిర్ణయించాలని తెలిపారు. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని సంఘం జిల్లా నాయకురాలు వేజెండ్ల తబిత కోరారు. తెనాలి శాంతకుమారి, మాన్యం పద్మ, ఎల్లమాటి మేరమ్మ, కె.శకుంతల ఎ.సరోజిని, టి.నిర్మల, సంతోషం, సుశీల తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వయం ఉపాధి పథకాలపై అవగాహన సదస్సు

నెహ్రూనగర్: స్వయం ఉపాధి పథకాలపై ఎస్సీ యువతకు బుధవారం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో (జిల్లా పరిషత్ కార్యాలయం రోడ్) అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వం ద్వారా అందించే స్వయం ఉపాధి పథకాలపై జిల్లాస్థాయిలో అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొని అవగాహన కల్పిస్తారని చెప్పారు. జిల్లాలోని నిరుద్యోగ ఎస్సీ యువత ఈ అవగాహన సదస్సుకు హాజరై ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని సూచించారు.

నేటి నుంచి ఖోఖో పురుషుల జట్టుకు శిక్షణ

జే పంగులూరు: మండల పరిధిలోని ఎంఎస్ఆర్‌బీఎస్ఎం జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో, ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో నేటి నుంచి ఖోఖో పురుషుల జట్టుకు శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి 22వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్టుకు శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న జట్టు ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని ధావణగెరె పట్టణంలో నిర్వహించనున్న దక్షిణ భారత జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ క్యాంపునకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 15 మంది క్రీడాకారులు హాజరవుతారని చెప్పారు. జట్టుకు శిక్షణ ఇచ్చేందుకు జాతీయ సీనియర్ క్రీడాకారుడు, షేక్ ఆలీ నవాజ్ కోచ్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు వెస్ట్: ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్ కాంపౌండ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళ్లు, దంతాలు, మధుమేహం, బీపీ తదితర వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, కార్మికులు వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

గుంటూరు ఎడ్యుకేషన్: అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడే సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ సీపీఆర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల, బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ మహిళా కళాశాలలో అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ సీపీఆర్ ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని గుర్తుచేశారు. దేశంలో ఒక్క శాతం మందికి సైతం ఇది తెలియకపోవటం దురదృష్టకరమన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కౌసల్యాదేవి, టీజేపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వంశీ కృష్ణారెడ్డి, అధ్యాపకులు పద్మజ, రెడ్ క్రాస్ సిబ్బంది పెరుమాళ్ల గౌరీశిరీష పాల్గొన్నారు.